క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ కాంగ్రెస్ 18వ డివిజన్ అధ్యక్షుడు మార్క రాజు తండ్రి మార్క స్వామి రెండురోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ మార్కరాజుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, 15వ డివిజన్ కార్పొరేటర్ శంకర్ నాయక్, రాజేశ్, జక్కుల దామోదర్, అజయ్, అవినాష్, సర్వోత్తమ్‌రెడ్డి పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని సిద్ధార్థ ఉన్నత పాఠశాలకు చెందిన 2002–04లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. పాఠశాల కరస్పాండెంట్, ప్రధాన ఉపాధ్యాయుడు టంగుటూరి రాజయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ, రవీందర్ రెడ్డి, కొమురయ్య, శంకర్, తిరుపతిరెడ్డి, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

24గంటలు వైద్యసేవలు అందించాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఈఎస్‌ఐ ఆస్పత్రిలో 24గంటల వైద్యసేవలు అందించాలని కార్మిక సంఘం నాయకుడు బాబా సోమవారం ఈఎస్‌ఐ ఆస్పత్రి డాక్టర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గత నెలలో రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ఆస్పత్రిని సందర్శించిన క్రమంలో కార్మికులకు 24 గంటల వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించగా ఆస్పత్రి వారు స్పందించి హామీ ఇచ్చారు. అయితే నెలరోజులు గడుస్తున్నా ఇచ్చిన హామీ అమలు చేయడం లేదని ఆరోపించారు. ఈఎస్‌ఐ ఆస్పత్రిలో పూర్తిస్థాయి వైద్యసేవలు ప్రారంభిస్తే కార్మికులకు, కార్మికుల కుటుంబాలకు ప్రయోజనం జరుగుతుందన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్సై రాములు

కమాన్‌పూర్: ఆటో, ఆటో ట్రాలీ డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్సై బేతి రాములు అన్నారు. మండల కేంద్రంలో ఆటో, ట్రాలీ డ్రైవర్లతో సోమవారం ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు మట్ట నర్సయ్యతో పాటు డ్రైవర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోదావరిఖనిటౌన్: స్థానిక శివాజీనగర్, మేద రిబస్తీ ఏరియాల్లో మంగళవారం 10గంటల నుంచి సాయంత్రం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పెద్దపల్లి కిషన్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అవిశ్వాస తీర్మానం సమావేశం వాయిదా

పాలకుర్తి: మండల ఎంపీపీ వ్యాళ్ల అనసూర్యపై మండలంలోని ఐదుగురు ఎంపీటీసీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం నిర్వహించనున్న సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు పెద్దపల్లి ఆర్డీవో మధుమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కోరుతూ ఈనెల 10తేదీన 5గురు ఎంపీటీసీలు ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. దీంతో ఈనెల 30న అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కాగా ఎంపీపీ 25న రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. మండలంలో మొత్తం 11 మంది ఎంపీటీసీలకు గాను అవిశ్వాస తీర్మాణానికి 5గురు ఎంపీటీసీలు మాత్రమే సంతకాలు చేశారని, దీనికి తోడు తనకు నోటీసును ఆలస్యంగా అందజేశారని కోర్టుకు విన్నవించారు. ఈ మేరకు హైకోర్టు అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని వాయిదా వేయాలని స్టే ఆర్డర్ ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు సమావేశాన్ని ప్రస్తుతం వాయిదా వేస్తున్నట్లు ఆర్డీవో పేర్కొన్నారు.

మూలమలుపులు మృత్యుకుహరాలు

- ప్రమాదకరంగా రోడ్డుపక్కనే బావులు
- ఎక్కడా కనిపించని ప్రమాద సూచికలు, కంచెలు
- భద్రతా చర్యలు తీసుకోవాలని వాహనదారుల డిమాండ్



హరిపురం-ఓదెల గ్రామాల మధ్య ప్రమాదకరంగా మూలమలుపు

ఓదెల: మండలంలోని పలు గ్రామాల్లో మూలమలుపులు ప్రాణాంతకంగా మారాయి. మండలంలోని కొలనూర్ నుంచి లంబాడితండాకు, హరిపురం నుంచి ఓదెలకు వెళ్లేటప్పుడు, ఓదెల నుంచి కొమిర గ్రామానికి, గుంపుల-గూడెం గ్రామాల్లో ఎస్సారెస్పీ కాలువ సమీపంలో మూలమలపులు మృత్యువు కుహరాలుగా మారాయి. రోడ్డు ప్రమాదాలు జరిగినా అధికారులు స్పందించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వినతిపత్రం అందించినా ఫలితం శూన్యం..

ప్రమాదకరంగా ఉన్న మూలమలపులను గుర్తించి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని పలుసార్లు ప్రయాణికులు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే మూలమలుపులు ఉన్న ప్రదేశాల్లో నిరుపయోగంగా ఉన్న బావులు ప్రమాదకరంగా మారాయి. దీంతో రాత్రిపూట బైక్ వాహనదారులు, స్కూలు బస్సులకు ప్రాణసంకటంగా మారాయి. మూలమలుపుల వద్ద రోడ్డు వెడల్పు చేయాలని ప్రతిపాదనలు ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. మూలమలుపుల వద్ద ఉన్న బావుల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు లేవు



మండలంలోని పలు గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుల ప్రదేశాల్లో ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలి. ఎదురెదురుగా వాహనాలు వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కర్రె రాజిరెడ్డి, రైతు, కొలనూర్

రోడ్డు వెడల్పు చేయాలి



మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా రోడ్డు వెడల్పు చేయాలి. ఓదెల నుంచి హరిపురం గ్రామానికి వచ్చేటప్పుడు ఎలాంటి ప్రమాద సూచికలు లేవు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు భద్రతా చర్యలు చేపట్టాలి

– కాశవేని చేరాలు, గోపరపల్లె

పెద్దపల్లికి బైపాస్ రోడ్డు వేయిస్తా

- ఎమ్మెల్యే విజయరమణారావు



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: రాజీవ్‌రోడ్డుపై పెరిగిన వాహనాల రద్దీని నియంత్రించేందుకు వీలుగా పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాల పరిధిలో బైపాస్ రోడ్డు వేయించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం పెద్దకల్వల శివారులో బైపాస్ రోడ్డు నిర్మాణానికి అనువైన స్థలాన్ని సోమవారం ఆర్‌అండ్‌బీ, మిషన్ భగీరథ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రధాన రాజీవ్‌రోడ్డుపై భారీ వాహనాల రద్దీని నియంత్రించేందుకు వీలుగా బైపాస్ రోడ్డు నిర్మిస్తానని ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విషయం విదితమే. బైపాస్‌రోడ్డు నిర్మించడంతో ప్రధాన రహదారిపై వాహన రద్దీ తగ్గడంతో పాటు బైపాస్ రోడ్డు ఏర్పాటు చేసే ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. మిషన్ భగీరథ ఈఈతో పాటు ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జి ఈఈ రాములు అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పల్లెల ప్రగతితోనే దేశాభివృద్ధి సాధ్యం

కాల్వశ్రీరాంపూర్: మౌలిక వసతులతోపాటు అన్ని రంగాల్లో పల్లెలు ప్రగతిపథంలో పయనిస్తేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని పెద్దరాతుపల్లిలో సోమవారం రూ.25లక్షల నిధులతో పశువైద్యకేంద్రం, రూ.20లక్షలతో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, రూ.5లక్షల నిధులతో జీపీ ప్రహరీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. గ్రామాభివృద్ధిలో సర్పంచ్ కృషిని ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యేను పంచాయతీ పాలకవర్గం, వైద్యులు సన్మానించారు. జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, సర్పంచ్ ఓరుగంటి కొమురయ్యగౌడ్, ఎంపీటీసీ బొల్లమల్ల కౌసల్య, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, తహసీల్దార్ జాహెద్ పాషా, పీఆర్ ఏఈ జగదీశ్, ఎంపీడీవో రామ్మోహనా చారి, ఎంపీవో గోవర్ధన్, సూపరింటెండెంట్ సురేశ్, వెటర్నరీ వైద్యాధికారులు సురేశ్‌గౌడ్, సునీత, మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి చంద్రారెడ్డి, ఉప సర్పంచు మహేశ్, వార్డు సభ్యులు రాజ్‌కుమార్, శిరీష, మాజీ సర్పంచులు మనోహర్‌రావు, మొగిలయ్య, సదానందం, సతీశ్, నాయకులు సఫీరొద్దీన్, కలీమొద్దీన్, రామిడి తిరుపతిరెడ్డి, మునీర్, వెంకన్న, మోహన్ పాల్గొన్నారు.

స్పెల్ విజార్డ్ జిల్లా పోటీలకు ఎంపిక



ప్రశంస పత్రాలతో హైస్కూల్ విద్యార్థులు

రామగుండం: పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) రాష్ట్ర ప్రభుత్వం, ఎస్సీఈఆర్టీ హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు నిర్వహించారు. పోటీల్లో రామగుండం హైస్కూల్, గోదావరిఖని బాలికల హైస్కూల్, కేజీబీవీ రామగుండం విద్యార్థులు హాజరయ్యారు. కాగా ఎండీ.నేహల్, సాధియా, అయేష, గౌస్, అబ్రార్ రామగుండం విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ఎల్టా జిల్లా ఫౌండర్ గడ్డం జగదీశ్వర్, కె.ముకుందం ప్రకటించారు. ఎంపికైన విద్యార్థులకు ఫిబ్రవరి 13న జిల్లా స్థాయి, 19న ఉమ్మడి జిల్లాస్థాయి పోటీ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎల్టా ప్రతినిధి, జిల్లా రిసోర్స్‌పర్సన్ జగదీశ్వర్, రామగుండం హెచ్‌ఎం.అజ్మీరా శారద, హెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్షుడు జి.మల్లేశం, నలుమాసు హరిప్రసాద్, బి.లక్ష్మణ్, ఎం.లక్ష్మీనారాయణ ఉన్నారు.

జాగటి శాంతమ్మకు క్రీడారత్న జాతీయ అవార్డు



ఎంపిక పత్రం అందుకుంటున్న శాంతమ్మ

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన శాంతమ్మ బహుజన సాహిత్య అకాడమీ వారి క్రీడారత్న జాతీయ అవార్డుకు ఎంపికైనట్లు జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ నియామక ఉత్తర్వులు విడుదల చేశారు. ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని ధన్వంతరి ఆస్పత్రిలో కాంట్రాక్టు కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న జాగటి శాంతమ్మ క్రీడారంగంలో తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకుని పలు అవార్డులను సొంతం చేసుకుంది. క్రీడారత్న జాతీయ అవార్డుకు ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు రంబుల్ స్ట్రిప్స్



రోడ్డుపై వేసిన రంబుల్ స్ట్రిప్స్

ధర్మారం: మండల కేంద్రంలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ అధికారుల సహకారంతో స్థానిక ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో వేగాన్ని అరికట్టడానికి, ప్రమాదాల నియంత్రణకు రోడ్డుపై రంబుల్ స్ట్రిప్స్ వేయించారు. రోడ్డు వారోత్సవాల్లో భాగంగా ధర్మారంలోని యూనియన్ బ్యాంకు, తహసీల్దార్, పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో రంబుల్ స్ట్రిప్స్ వేసినట్లు ఎస్సై తెలిపారు.

పేరెంట్స్ డే వేడుకలు



పాదాభివందనం చేస్తున్న విద్యార్థి

పాలకుర్తి: మండలంలోని జీడినగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని యూనివర్సల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆలోచింపజేశాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ఈ సృష్టిలో తల్లిదండ్రులను మించిన దైవం లేదన్నారు. విద్యార్థులకు తల్లిదండ్రుల గొప్పతనం గురించి అవగాహన కల్పించేందుకే ప్రతి ఏటా పాఠశాలలో పేరెంట్స్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఎం అఫ్జల్, టీచర్లు పాల్గొన్నారు.

నారాయణపూర్ జాతర వేలం



వేలం నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నారాయణపూర్ సమ్మక్క జాతర వేలం సోమవారం ఉత్సవ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా కొబ్బరికాయలు, బెల్లం రూ.49,100కు గాజుల నరేశ్, కోళ్లు(తల్లి అరాధన) రూ.36వేలకు రాజయ్య, కేశ ఖండన రూ.30వేలకు వెంకటేశం, లడ్డు ప్రసాదం రూ.21వేలకు పర్శరాములు దక్కించుకున్నట్లు చైర్మన్ మూల హరీశ్ తెలిపారు. సర్పంచ్ సాగర్‌రావు, ఎంపీటీసీ రమేశ్, ఉత్సవ కమిటీ సభ్యులు రామారావు, సతీశ్ పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యార్థినులకు రక్త పరీక్షలు



రక్త పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

జూలపల్లి: మండలంలోని తేలుకుంటలో ఉన్న కస్తూర్బా బాలికల విద్యాలయంలో సోమవారం విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ అనిత 130 మంది విద్యార్థినులకు రక్త పరీక్షలు చేశారు. ఏఎన్‌ఎం మౌనిక, పోలోజు అరుణ, ఆశా కార్యకర్తలు శారద, శాంత పాల్గొన్నారు.

ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా..

యైటింక్లయిన్‌కాలనీ: ఎనీమియా ముక్త్‌భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 17వ డివిజన్ సంతోష్‌నగర్‌లోని కేజీబీవీ పాలకుర్తి బాలికల పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి రక్తహీనత గల విద్యార్థినులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ చక్రధర్, సృజన మాట్లాడుతూ రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని బాలికలకు సూచించారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వరూప, ఆర్‌బీఎస్‌కే వైద్యులు డాక్టర్ చక్రధర్, సృజన, ఫార్మసిస్ట్ అఫ్సాన, ఏఎన్‌ఎం మహేశ్వరి, ఆశా కార్యకర్త నాగమణి పాల్గొన్నారు.

క్రీడాదుస్తులు అందజేత



దుస్తులు అందజేస్తున్న జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: సింగరేణి క్రీడాకారులకు క్రీడా దుస్తులను సోమవారం ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ అందజేశారు. జీఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను విడుదలైన దుస్తులను క్రీడాకారులకు పంపిణీ చేశారు. గుర్తింపు యూనియన్ కార్యదర్శి జీగురు రవీందర్, పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్, డీవైపీఎం వేణుగోపాల్, వంశీధర్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. దీనికి ముందు సింగరేణి పాఠశాలల్లో కంప్యూటర్ శిక్షణ తరగతులను జీఎం పరిశీలించారు.

సంక్షిప్త వార్తలు

స్పెల్ విజార్డ్, డ్రామా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ధర్మారం: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆంగ్లంలో నిర్వహించిన స్పెల్ విజార్డ్, డ్రామా పోటీల్లో నందిమేడారం, కొత్తూరు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. స్పెల్‌విజార్డ్ పోటీల్లో మండలంలోని నందిమేడారం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న జోషిత ప్రథమ స్థానంలో నిలిచింది. డ్రామా పోటీల్లో కొత్తూరు పాఠశాలకు చెందిన శరణ్య, షాలినీ, సాత్విక, అలేఖ్య, అక్షిత గ్రూప్ ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కేజీబీవీ విద్యార్థులు ప్రత్యేక విభాగంలో జిల్లాస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థులను మండల విద్యాధికారి ఛాయాదేవి అభినందించారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

మంథని: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికై మొదటిసారిగా మంథనికి వచ్చిన చందుపట్ల సునీల్‌రెడ్డిని పార్టీ స్థానిక నాయకులు సోమవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. నాయకులు బూడిద తిరుపతి, పోతరవేణ క్రాంతికుమార్, బోగోజు శ్రీనివాస్, రమేశ్, మల్లికార్జున్ ఉన్నారు.

రేపు జాతర వేలం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నీరుకుల్ల–వేగురుపల్లి సమ్మక్క జాతర సందర్భంగా 31న సీల్డు టెండర్ కం వేలం జాతర ప్రదేశంలో నిర్వహించనున్నట్లు ఎండోమెంట్ కార్యనిర్వహక కార్యదర్శి శంకరయ్య తెలిపారు. ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు జరిగే జాతరలో పుట్నాలు, ప్యాలాలు, తల్లి అరాధన (కోళ్లు) అమ్ముకోవడానికి ధరావత్ రూ.20వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

ఆంగ్ల భాషా ప్రతిభా పోటీలు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్లో సోమవారం ఇంగ్లిష్ లాగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ నిర్వహించిన స్పెల్ లిజార్డ్ డ్రామా పోటీల్లో వెన్నంపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎస్ రాంచరణ్, పెగడపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పి.రష్మిత ద్వితీయ స్థానం సాధించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోటీల్లో కేజీబీవీ, మల్యాల మోడల్‌స్కూల్, వెన్నంపల్లి, పెగడపల్లి, కాల్వశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఎల్టా కన్వీనర్ కూరపాటి సత్యప్రకాశ్‌రావు, హెచ్‌ఎం దిడ్డి సతీశ్, నరెడ్ల సునీత పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షప్యాడ్‌ల పంపిణీ

రామగిరి: సెంటినరీకాలనీ కస్తూర్బా విద్యార్థులకు సోమవారం స్పెషల్ ఆఫీసర్ మంజుశ్రీ పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కల్వచర్లకు చెందిన సౌమిత్రి నారాయణాచార్యుల జ్ఞాపకార్థం వారి కుమారుడు తిరుమలాచార్యులు పరీక్ష ప్యాడ్‌లు అందజేయగా విద్యార్థులకు పంపిణీ చేశారు. సిద్దు, లక్ష్మణ్ ఉన్నారు.

సంకటహర చతుర్థి

సుల్తానాబాద్: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఉన్న సాంబశివాలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా హోమం నిర్వహించారు. సోమవారం రాత్రి గణపతి హోమం, అభిషేకం, అన్నపూజ, రుద్రాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను పూజారి రమేశ్ అందజేశారు.

కాల్వశ్రీరాంపూర్ మండలంలో..

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం సంకష్టహర చతుర్థి పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వరుడికి గరికతో పూజలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

ఆయుష్మాన్ కేంద్రాలుగా పేరు మార్పు

కమాన్‌పూర్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య, వాటి పరిధిలోని ఉప కేంద్రాలను ఆయుష్మాన్ కేంద్రాలుగా పేరుమార్చిన నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర కో ఆర్డినేటర్ తిరుపతి సందర్శించి పరిశీలించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రవిసింగ్, పీహెచ్‌సీ వైద్యాధికారి అశోక్‌కుమార్ ఉన్నారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా లింగయ్య



రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామానికి చెందిన జూల లింగయ్యను కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు సోమవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ నియామకపత్రం అందజేశారు.

అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి



భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ విజేందర్

సుల్తానాబాద్‌రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధించామని సర్పంచ్ కోటగిరి విజేందర్‌గౌడ్ అన్నారు. మండలంలోని నీరుకుల్ల పంచాయతీ నూతన భవనం ఎంఎన్‌జీఆర్‌ఈజీఎస్, రూర్బన్ నిధులు రూ.24లక్షలు, మహిళా సమాఖ్య భవనం డీఎంఎఫ్‌టీ నిధులు రూ.15.28లక్షలతో నిర్మించిన భవనాలను సోమవారం సర్పంచ్, పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఎంపీటీసీ శంకర్, ఉపసర్పంచ్ మాధవరావు, వార్డుసభ్యులు సౌజన్య, అంజమ్మ, మమత, రాజు, శంకర్, సంపత్, వేణు, నాయకులు రమేశ్‌గౌడ్, సతీశ్, అంజయ్య, వైకుంఠం, తిరుపతిరావు, దమోదర్‌రావు, భూంరావు, కొమురయ్య పాల్గొన్నారు.

జాతర ఉత్సవ కమిటీ చైర్మన్‌గా హరీశ్



సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నారాయణపూర్ సమ్మక్క జాతర ఉత్సవ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మూల హరీశ్, డైరెక్టర్లుగా పర్శరాములు, గుడుగుల సతీశ్, వెంకటేశం, సదానందం, సధాకర్, కొమురయ్య, ప్రభాకర్, రామారావు, తిరుపతిరావు, సుధాకర్‌రావు, చంద్రయ్యను ఎన్నుకున్నారు. ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జరిగే జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని చైర్మన్ పేర్కొన్నారు.

సీఐగా బాధ్యతలు స్వీకరణ



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి సీఐగా ఆర్.కృష్ణ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటిదాకా లక్షెట్టిపేట సీఐగా పనిచేసిన కృష్ణ బదిలీపై పెద్దపల్లికి వచ్చారు. పెద్దపల్లి సర్కిల్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రజా సహకారంతో పనిచేస్తానన్నారు. ప్రజలు పోలీసులకు సంపూర్ణ సహకారం అందించాలన్నారు.

వ్యవసాయ క్షేత్ర పర్యటనలో విద్యార్థులు



నాటు వేస్తున్న విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని స్పందన మోడల్ స్కూల్ విద్యార్థులను సోమవారం యాజమాన్యం వ్యవసాయ క్షేత్ర పర్యటనకు తీసుకెళ్లింది. స్థానిక సానా రామకృష్ణారెడ్డి రైతు వ్యవసాయ క్షేత్రానికి తీసుకెళ్లి వరి పంట నాటు వేసే విధానాన్ని, కలుపును ఎలా తీస్తారో రైతులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఓదెలు యాదవ్, హెచ్‌ఎం రవీందర్‌రావు, సైన్స్ టీచర్ అమల, మాధవి, అనూష పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

గోదావరిఖనిటౌన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని చదవాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. సోమవారం గాంధీనగర్‌లోని సెయింట్‌పాల్ పాఠశాలలో జరిగిన పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కళారంగాల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైకుంఠధామంలో వసతులు కల్పించండి

జ్యోతినగర్: గోదావరి నది ఒడ్డున మున్సిపల్ నిధులతో మేడిపల్లిలో నిర్మించిన వైకుంఠధామంలో వసతులు కల్పించాలని కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ సోమవారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ మేడిపల్లి గ్రామ శివారులో నిర్మించిన వైకుంఠధామానికి అన్ని రకాల ఏర్పాట్లు చేయిస్తానని హామీ ఇచ్చారని కార్పొరేటర్లు తెలిపారు.